

నేటి నుంచి శ్రావణమాసం

ఈ ఏడాది అధిక మాసం రావడంతో రెండు నెలల పాటు శ్రావణ మాసం పూజలు కొనసాగుతాయని కాళేశ్వర ఆలయ అర్చకుడు తెలిపారు. - 8లో▸



గంజాయి పట్టివేత


కాజీపేట జంక్షన్‌లో రైల్వే పోలీసులు సోమవారం 62 కిలోల గంజాయిని పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.12.40 లక్షలు ఉంటుందన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.5°/24.0°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

రాజధానికి చేరిన కారుచిచ్చు



అంతర్గత కుమ్ములాటలపై బీఆర్‌ఎస్ అధిష్టానం సీరియస్

- మానుకోట రాజకీయాలపై నిశిత పరిశీలన
- విమర్శలు, వ్యతిరేకతలపై నిఘా వర్గాల ద్వారా ఆరా
- నాయకులకు హైదరాబాద్ నుంచి నేడో.. రేపో పిలుపు
- ఐక్యతారాగం కోసం ప్రయత్నాలు

సాక్షి, మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల ముందు అధికార బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల మధ్య మాటల యుద్ధం పెరుగుతోంది. విమర్శలు, ప్రతి విమర్శలు, అవినీతి ఆరోపణలు కొనసాగుతూనే ఉన్నాయి. రోజురోజుకూ మితిమీరిపోతున్న జిల్లా నాయకుల రభస రాజధానికి చేరింది. మొదటి నుంచి తలనొప్పిగా ఉన్న మానుకోట జిల్లా నాయకుల తీరుపై అధినాయకత్వం సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. నేతల మధ్య మాటల యుద్ధానికి ఫుల్‌స్టాప్ పెట్టకపోతే పార్టీకి, పోటీ చేసే అభ్యర్థికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు హైదరాబాద్‌కు పిలిపించి ఐక్యంగా ఉండాలని వార్నింగ్ ఇచ్చే అవకాశం ఉందని పార్టీలోని సీనియర్ నాయకులు తెలిపారు. నేడో.. రేపో జిల్లాలోని ముఖ్య నాయకులకు రాజధాని నుంచి పిలుపు రానుంది.

మానుకోటలో మాటల యుద్ధం..

ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు వర్గీయుల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ఇప్పటికే ఎమ్మెల్సీ వర్గీయులు ఎమ్మెల్యే అంటేనే మండిపడుతున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే సొంతపార్టీ ప్రజాప్రతినిధులపై కక్షగట్టి అణగదొక్కుతున్నారని ఎమ్మెల్సీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయిస్తే.. అందులో తమ వార్డుల్లో పనులకు ప్రాధాన్యత ఇవ్వలేదని, చివరకు రాష్ట్ర నాయకత్వం చొరవ తీసుకున్న తర్వాత నిధులు కేటాయించారని ఎమ్మెల్సీ వర్గీయులైన కౌన్సిలర్లు బాహాటంగానే ఆరోపణలు చేశారు. ఇంతటితో ఆగకుండా ఈసారి శంకర్‌నాయక్‌కు టికెట్ ఇవ్వొద్దని బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసుకొని టికెట్ ఇస్తే ఓడిస్తామని చెబుతున్నారు. అవసరమైతే నోటాకైనా ఓటు వేస్తామని, స్థానిక ఎమ్మెల్యేకు ఓటు వేసే ప్రసక్తే లేదని అంటున్నారు. ఇలా మానుకోటలో మొదలైన 'కారు'చిచ్చు కేసముద్రం, నెల్లికుదురు మండలాలకు పాకింది. అయితే ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కూడా దూకుడుగా ముందుకు సాగుతున్నారు. అసమ్మతి నాయకులను మచ్చిక చేసుకోవడం, నాయకుల వద్దకు కుటుంబ సభ్యులను పంపించి ఈ సారి మద్దతు ప్రకటించాలని కోరుతున్నట్లు సమాచారం. అదే విధంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు వర్గానికి కౌంటర్‌గా తనకు ముఖ్యమంత్రికి మధ్య మధ్యవర్తులు ఎవరూ లేరని, పైరవీలతో తాను రాజకీయాలు చేయడంలేదని ఎమ్మెల్యే విమర్శలు గుప్పిస్తున్నారు. తనకు ప్రజల మద్దతు ఉందని, మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

డోర్నకల్‌లో ఆగని పోరు..

మూడు దశాబ్దాలుగా డోర్నకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్, మంత్రి సత్యవతిరాథోడ్ మధ్య అంతర్గత పోరు కొనసాగుతూనే ఉంది. ఒకే పార్టీలో ఉన్నా.. ఇప్పటికీ ఒకరంటే మరొకరికి గిట్టదు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేపట్టిన నియోజకవర్గ పర్యటనలో అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. దంతాలపల్లి నుంచి మొదలుకొని కురవి మండలం వరకు నిరసనలు, నిలదీతలు, అడ్డగింతలు, పలుచోట్ల కొట్లాటలు కూడా జరుగుతూనే ఉన్నాయి. అభివృద్ధి పనులు, డబుల్ బెడ్రూం ఇళ్లు, పోడు పట్టాలు, వృద్ధాప్య పింఛన్లు అందించాలని ఎమ్మెల్యేను నిలదీస్తున్నారు. కొన్నిచోట్ల రెడ్యానాయక్‌ను అడ్డుకున్న వారిలో మంత్రి సత్యవతిరాథోడ్ అనుచరులు ఉండడం గమనార్హం. అయితే ఈ పంచాయితీ అంత సొంత పార్టీవారే చేయిస్తున్నారని, మొదటి నుంచి మా పార్టీ వారి నుంచే ఇబ్బందులు వస్తున్నాయని రెడ్యానాయక్ సత్యవతిరాథోడ్‌ను ఉద్దేశించి ఘాటుగా విమర్శించారు. ఇదిలా ఉండగా మంత్రి సత్యవతి రాథోడ్ పలు సందర్భాల్లో తనకు రాజకీయ జన్మనిచ్చింది డోర్నకల్ అని, సీఎం ఆదేశిస్తే ఇక్కడి నుంచి పోటీకి సిద్ధమని ప్రకటించారు. ఇలా వారిద్దరి మధ్య వర్గపోరు కొనసాగుతూనే ఉంది.

అధినాయకత్వం సీరియస్..

జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను బీఆర్‌ఎస్ అధిష్టానం నిశితంగా పరిశీలిస్తోంది. నిఘా వర్గాల ద్వారా నివేదిక సేకరిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నేతల మధ్య వైరం సరికాదని పలుమార్లు హెచ్చరికలు చేశారు. అయినా నేతల్లో మార్పు రాలేదని ఇటీవల జరిగిన ఘటనలను పరిశీలిస్తే అర్థమవుతోంది. తమ అనుచరులు తిరుగుబాటు చేస్తుంటే రాష్ట్ర కార్యదర్శి పదవిలో ఉన్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఎందుకు మౌనంగా ఉంటున్నారనేది చర్చగా మారింది. అందుకోసమే ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను హైదరాబాద్‌కు పిలిపించి మాట్లాడాలని అధినాయకత్వం నిర్ణయించినట్లు తెలిసింది. నేడో, రేపో పిలుపు వస్తుందనే ప్రచారం కూడా జరుగుతోంది. అదే విధంగా డోర్నకల్ నియోజకవర్గంలో కూడా గ్రూపు తగాదాలు లేకుండా చూడాలని ఇప్పటికే మంత్రి సత్యవతి, ఎంపీ కవితతో మంత్రి కేటీఆర్ మాట్లాడినట్లు సమాచారం. మరోసారి వీరిద్దరితో పాటు ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను కూడా పిలిపించి మాట్లాడాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నట్లు తెలిసింది. కాగా అధినాయకత్వం పిలిపించి ఏం చెబుతుంది.. అందుకు జిల్లా నాయకులు ఎలా స్పందిస్తారు.. ఎవరికి టికెట్లు ఇచ్చినా పార్టీ గెలుపుకోసం ఐక్యంగా ముందుకు వెళ్తారా అనేది వేచి చూడాల్సిందే.

బురద రోడ్లను చూడండి..

- ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఎదుట యువకుల నిరసన
- పట్టాలు ఇవ్వాలని గిరిజనుల డిమాండ్
- నిరసనలు, అడ్డగింతల మధ్య కొనసాగుతున్న రెడ్యా పర్యటన



బురద రోడ్డుపై వాహనంలో వెళ్తున్న ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



రోడ్డుకు అడ్డుగా నిలబడి నిరసన తెలుపుతున్న యువకులు

కురవి: డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ చేపట్టిన నియోజకవర్గ పర్యటన నిరసనలు, అడ్డగింతలు, గొడవల మధ్య కొనసాగుతోంది. ఏ గ్రామానికి వెళ్లినా యువకులు, గ్రామస్తులు సమస్యలు ఏకరువు పెడుతున్నారు. పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా సోమవారం కురవి మండలంలోని నల్లెల్ల, తాట్యతండా, బంచరాయి తండా, కొత్తూరు(జీ) గ్రామాల్లో ఎమ్మెల్యే రెడ్యానాయక్ పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈక్రమంలో నల్లెల శివారు సూర్యతండాలో పర్యటించిన ఎమ్మెల్యే ఎదుట యువకులు నిరసన తెలిపారు. తండాలోని బురద రోడ్లపై వెళ్లి పరిశీలించాలని అడ్డుగా నిలబడ్డారు. దీంతో సీరోలు ఎస్సై రమాదేవి యువకుల వద్దకు వెళ్లి పక్కకు వెళ్లాలని సూచించారు. తండాలో అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయని, ఒక్క సీసీరోడ్డు లేదని, బురద రోడ్లను ఎమ్మెల్యే పరిశీలించాలని యువకులు పట్టుబట్టారు. దీంతో ఎమ్మెల్యే తన వాహనంలో నుంచి పరిశీలిస్తూ బురద రోడ్ల మీదుగా ముందుకు వెళ్లారు. కొంత దూరం వెళ్లాక మరో రోడ్డును చూడాలని మహిళలు కోరడంతో ఆ రోడ్డును సైతం పరిశీలించారు. అనంతరం సూర్యతండాలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు పార్టీలు మారిండని, మూడు గంటల కరెంట్ ఇస్తడట అని విమర్శించారు. మూడు పంటలకు సరిపడా నీళ్లు ఇస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆదరించాలని కోరారు. సూర్యతండాలో సీసీరోడ్ల నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.10లక్షలు, జీపీ నిధుల నుంచి రూ.15లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేస్తానని హామీ ఇచ్చారు. తాట్యతండాతో పాటు పిల్లిగుండ్ల తండా, బంచరాయితండా జీపీ, కొత్తూరు(జీ) గ్రామాల్లోని అనేక మంది రైతుల భూములకు పట్టాలు రాలేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పట్టాలు ఇప్పిస్తే ఓట్లన్నీ మీకే వేస్తామని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే కలెక్టర్ శశాంకతో ఫోన్‌లో మాట్లాడారు. మంగళవారం తండాలకు చెందిన రైతులతో మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని కోరగా, కలెక్టర్ ఒప్పుకున్నారు. ఎన్నికల నాటికి రైతుల భూములకు పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని, అవసరమైతే సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లి పట్టాలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి, రమేష్, శరత్, కట్ల సుమలత, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ లక్ష్మీలాలునాయక్, ఎంపీపీ గుగులోత్ పద్మావతి, చైర్మన్లు గార్లపాటి వెంకటరెడ్డి, తోటలాలయ్య, డీఈ మహేష్, ఏఎంసీ డైరెక్టర్ గార్లపాటి భరద్వాజ్‌రెడ్డి, బజ్జూరి పిచ్చిరెడ్డి, చంద్రారెడ్డి, రాంచంద్రయ్య, బానోత్ గణేష్, బండి దీపక్, బానో త్ రాము, రాజునాయక్ పాల్గొన్నారు.

యువత ముందుకుసాగాలి

నెహ్రూసెంటర్: చదువే ఆయుధంగా నాయీ బ్రాహ్మణ యువత ముందుకు సాగుతూ విజయాలు సాధించాలని తెలంగాణ నాయీ బ్రాహ్మణ ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ జి. హరిప్రసాద్ అన్నారు. నాయీ బ్రాహ్మణ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవన్‌లో పదో తరగతిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో నోపా జిల్లా అధ్యక్షుడు ఎలమందల కృష్ణప్రసాద్, నోపా గౌరవ అధ్యక్షుడు ఎడ్ల కొమురయ్య, ప్రోగ్రాం కన్వీనర్ నేలపోగుల దుర్గయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



కొత్తగూడ: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష అన్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందులకు లొంగని మలేరియా వ్యాప్తిచెందుతున్నట్లు వరంగల్ ఎంజీఎంలో నిర్ధారణ అయిందన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో దోమల ఉధృతి వల్ల మలేరియా వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యులు మురళీనాయక్, శివ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిపో అభివృద్ధికి కృషి చేయాలి



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేయాలని సంస్థ డిప్యూటీ ఆర్ఎం కృపాకర్‌రెడ్డి ఉద్యోగులు, సిబ్బందికి సూచించారు. సోమవారం డిపో ఆవరణలో ఉత్తమ ప్రతిభకనబర్చిన ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా కృపాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. డిపో లాభాల బాటలోకి వచ్చేలా ఉద్యోగులు, సిబ్బంది చొరవ చూపాలన్నారు. అనంతరం జూన్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లు ఈకే.స్వామి, డి.నాగరాజు, కేఏ.కుమార్, వి.శ్రీనివాస్, ఎండీ.తాజుద్దీన్, పి.వెంకన్న, ఆర్.బీ సింగ్, కండక్టర్లు ఏ.నర్సయ్య, సీహెచ్.రమేష్, ఏఏ.కుమార్, బీఏ.కుమార్, జి.యాదగిరి, పి.సుదర్శన్, ఎస్.బి.రెడ్డి, వి.ఉమను నగదు పురస్కారంతో పాటు అవార్డులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ విజయ్,ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలోని గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యకు ప్రాధాన్యత ఇచ్చి, అధిక సంఖ్యలో గురుకులాలను ఏర్పాటు చేసి ఆరేళ్లు గడిచినా సొంత భవనాలు నిర్మించలేదన్నారు. సరిపడా ఉపాధ్యాయులను నియమించకపోవడంతో ఉన్నవారిపై అధిక భారం పడుతోందన్నారు. బోధన, బోధనేతర పనులతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు. కేర్ టేకర్లు, డిప్యూటీ వార్డెన్లను నియమించి ఉపాధ్యాయులకు నైట్‌డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. అందరికీ పారిటీ స్కేల్ అమలు చేయాలని, హెల్త్‌కార్డులు అందజేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే ఆగస్టు 5న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టి మహాధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, ఉపాధ్యక్షురాలు స్వప్న, మానుకోట, కురవి మండలాల బాధ్యులు సంజీవ, బాలునాయక్, ప్రవీణ్‌కుమార్, ప్రసాద్, రఘురాం, రవికుమార్, సురేష్, హరినాయక్, రాంజీ, లక్ష్మయ్య, బాబు, వెంకటేశ్వర్లు, రాజయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి బీఫార్మసీ ఏడో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీఫార్మసీ 7వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 19న మొదటి పేపర్ ఇన్‌స్ట్రుమెంటల్ మెథడ్స్ ఆఫ్ అనాలసిస్, 21న రెండో పేపర్ ఇండస్ట్రియల్ ఫార్మసీ-2, 24న మూడో పేపర్ ఫార్మసీ ప్రాక్టీస్, 26న నాలుగో పేపర్ నావెల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే చర్యలు

- డీఎస్పీ సత్యనారాయణ



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

కొత్తగూడ: గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. త్వరలో అసెంబ్లీ జరగనున్నాయని, ఎలాంటి సమస్యల తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. నక్సల్స్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎన్నికల ముందు నక్సల్స్ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నాలు చేసే అవకాశాలు ఉన్నాయని, మాజీల కదలికలను గమనించాలన్నారు. ఇందుకు ఇన్‌ఫర్మేషన్ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలన్నారు. కొత్తగూడ, గంగారం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఎన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి, వాటి రవాణా వ్యవస్థ, ఇతర అంశాలను తెలుసుకున్నారు. స్టేషన్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వస్తే తమ సమస్యలు పరిష్కారమవుతాయనే భరోసాను ప్రజలకు పోలీసులు కల్పించాలని సూచించారు. అనంతరం మండలంలోని గుంజేడు ముసలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట గూడూరు సీఐ ఫణీందర్, కొత్తగూడ, గంగారం ఎస్సైలు నగేష్, దిలీప్ ఉన్నారు.

యాదవులకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ యాదవ్

మహబూబాబాద్: రాష్ట్రంలో యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో కౌన్సిలర్ ఎడ్ల వేణు నివాసంలో సోమవారం సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రాజకీయాల్లో యాదవుల పాత్రపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌యాదవ్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు యాదవులు, ఉపకులాలకు 22 ఎమ్మెల్యే టికెట్లు,7ఎమ్మెల్సీలు, 5 ఎంపీ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కులగణన వెంటనే చేపట్టాలన్నారు. యాదవులకు ఎస్‌ఎస్‌టీ రిజర్వేషన్ కల్పించాలన్నారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర బడ్జెట్‌లో 18శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. హక్కులు, డిమాండ్ల సాధనకు యాదవ కులస్తులందరూ కలిసికట్టుగా పని చేయాలని, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వేణుమాదవ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్, నాయకులు సిద్ధిరాజు, రాజు, ఎడ్ల రమేష్, సర్పంచ్ బట్టు శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల రక్షణకు ఉద్యమిద్దాం



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నెహ్రూసెంటర్: కార్మికుల హక్కుల పరిరక్షణకు క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమించాలని ఐక్య కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల జిల్లా సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి రాములు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బిల్లకంటి సూర్యనారాయణ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తుందని మండిపడ్డారు. సామాన్య ప్రజలకు భారంగా మారిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేసి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21 నుంచి వివిధ రూపాల్లో ప్రచారం నిర్వహించి ఆగస్టు 9, 10 తేదీల్లో మండల, జిల్లా కేంద్రాల్లో సదస్సులను నిర్వహించి జయప్రదం చేయాలన్నారు. ఆకుల రాజు, నర్ర శ్రావణ్, ఎస్‌కే.మదార్, భాస్కర్‌రెడ్డి, కోటేష్, కుంట ఉపేందర్, శ్రీధర్, కుమ్మరికుంట్ల నాగన్న, లింగన్న ఉన్నారు.

మంత్రి ప్రారంభిస్తారని..

తప్పని ఎదురుచూపులు

- ప్రారంభానికి సిద్ధమైన సఖి కేంద్రం
- అద్దె భవనంలో ఇబ్బంది పడుతున్న సిబ్బంది
- బాలసదనం పరిస్థితి ఇంతే..
- బీసీ బాలికల హాస్టల్ గదిలో కొనసాగుతున్న వైనం

మహబూబాబాద్: బాధిత మహిళలకు భరోసానిచ్చే సఖి కేంద్రం ప్రారంభోత్సవంపై నీలినీడలు అలుముకున్నాయి. అభాగ్యులను చేరదీసి వారికి మనోధైర్యం కల్పించేందుకు ఈ కేంద్రం పనిచేస్తోంది. అద్దె భవనంలో కొనసాగుతున్న సఖి కేంద్రం నిర్వహణ కోసం నూతన భవనం నిర్మించారు. అయితే ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. మంత్రి సత్యవతిరాథోడ్ వచ్చి ప్రారంభిస్తారని అధికారులు, సిబ్బంది ఎదురుచూస్తున్నారు. అలాగే బాలసదనం భవనం కూడా ప్రారంభించాల్సి ఉంది. ప్రస్తుతం బీసీ బాలికల హాస్టల్‌లో బాలసదనం కొనసాగుతుండగా.. తల్లిదండ్రులను కోల్పోయి అందులో తలదాచుకుంటున్న బాలికలు తమకు కేటాయించిన భవనాన్ని ప్రారంభించాలని మంత్రిని కోరుతున్నారు.

అద్దె భవనంలో..

జిల్లా కేంద్రం కొత్తబజారులో అద్దె భవనంలో సఖి కేంద్రం నిర్వహిస్తున్నారు. ప్రతీ నెల రూ.2,5000 అద్దె చెల్లిస్తున్నారు. సెంటర్‌లో అడ్మిన్, లీగల్ అడ్వైజర్, ఇద్దరు కౌన్సిలర్లు, ఇద్దరు కేస్ వర్కర్లు, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఇద్దరు మల్టీపర్పస్ వర్కర్లు, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారు. కాగా బాధిత మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మనోధైర్యం నింపుతూ జీవితంపై భరోసా కల్పిస్తున్నారు. కౌన్సెలింగ్‌తో పాటు లీగల్, మెడికల్ సపోర్టు, తాత్కాలిక షెల్టర్ కల్పిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు రాత్రి సమయంలో తీసుకువచ్చిన మహిళలకు సైతం ఇక్కడే షెల్టర్ ఇస్తున్నారు. సత్ఫలితాలు ఇస్తున్న సఖి సెంటర్‌కు నూతన భవనం నిర్మించినప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు.

పిచ్చి మొక్కల దర్శనం..

జిల్లా కేంద్రం శివారులో సఖి సెంటర్ భవన నిర్మాణం కోసం పది గుంటల భూమి కేటాయించారు. మూడేళ్ల క్రితం భవనం పనులు ప్రారంభించగా.. పలు అవాంతరాల మధ్య రూ.56లక్షల వ్యయంతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే భవనం ప్రారంభం కాకపోవడంతో కేంద్రం ఆవరణ అంతా పిచ్చి మొక్కలు పెరిగాయి. గేట్ ఊడిపోయే పరిస్థితికి వచ్చింది. ఇలానే వదిలేస్తే మరమ్మతులు చేసిన తర్వాతనే ప్రారంభించాల్సి పరిస్థితి ఉంటుంది. కాగా ఈ ఏడాది ఏప్రిల్ 9న మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభిస్తారని హడావుడి చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రారంభ ప్రకటన రాలేదు. బిజీ షెడ్యూల్, పలు కారణాల వల్ల మంత్రి సత్యవతిరాథోడ్ సమయం ఇవ్వకనే ప్రారంభానికి నోచుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

ఒకే గదిలో బాలసదనం..

తల్లిదండ్రులను కోల్పోయిన బాలికల కోసం గూడూరులో ఏర్పాటు చేసిన బాలసదనం సెంటర్‌ను మూడేళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్ భవనంలోని ఒక గదిలోకి మార్చారు. కేంద్రంలో 30మంది బాలికలు ఉండగా.. 10మంది జిల్లా కేంద్రంలోని కేజీబీవీ, చిన్నగూడూరు, గార్ల కేజీబీవీల్లో ప్రవేశాలు పొందినట్లు సిబ్బంది తెలిపారు. కాగా ప్రస్తుతం బాలసదనంలో 20మంది బాలికలు ఉన్నారు. వీరితో పాటు సూపరింటెండెంట్, హౌస్ మదర్, కౌన్సిలర్, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్, కుక్, నైట్‌వాచ్‌మన్ ఒకే గదిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా బాలికల పరిస్థితి చూసి చలించిపోయిన కలెక్టర్ శశాంక డీఆర్‌డీఏ భవనం బాలసదనం కోసం కేటాయించి మరమ్మతులు కూడా చేయించారు. పనులు పూర్తికాగా మంత్రి చేతుల మీదుగా ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోని సఖి కేంద్రం భవనం

త్వరలోనే డీఆర్‌డీఏ భవనంలోకి బాలసదనం ..

బీసీ బాలికల హాస్టల్‌లో కొనసాగుతున్న బాలసదనం కేంద్రాన్ని త్వరలోనే డీఆర్‌డీఏ భవనంలోకి మారుస్తాం. మంత్రి సత్యవతి రాథోడ్ చేతులమీదుగా ప్రారంభిస్తాం. తల్లిదండ్రులు కోల్పోయిన బాలికలకు రక్షణ కోసమే బాలసదనం. వారు ఉన్నతస్థాయికి చేరుకునేలా బాలసదనం అండగా ఉంటుంది. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

– నాగవాణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్

రైతు వేదికలు.. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలు

- టీపీసీసీ అధికార ప్రతినిధి బెల్లయ్యనాయక్



మాట్లాడుతున్న తేజావత్ బెల్లయ్యనాయక్

మహబూబాబాద్ రూరల్: రైతు వేదికలు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలుగా మారాయని టీపీసీసీ అధికార ప్రతినిధి తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. జిల్లా కేంద్రం గుమ్ముడూరులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు వేదికల్లో ఏ రోజైనా రైతుల కోసం, వారి సమస్యలపై సభలు, సమావేశాలు పెట్టారా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకులందరూ మోసగాళ్లేనని మండిపడ్డారు. ఇప్పటి వరకు రైతుల రూ.లక్ష రుణమాఫీ ఎందుకు చేయలేదో అధికార పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ అమలు చేశారని, బీఆర్‌ఎస్ పార్టీ రైతులకు చేసిందేమి లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 31లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలు హోల్డ్‌లో పెట్టారని, 23,670 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చినప్పటికీ పరిహారం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సాగుకు 24గంటల ఉచిత కరెంట్ ఇస్తామని, రైతుల రుణమాఫీ కూడా అమలు చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ విద్యుత్ కొనుగోళ్లలో రూ.8వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రైతు వేదికలకు వస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను రైతులు నిలదీయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజయ్య, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు వీరన్నయాదవ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న, మాజీ జెడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, పట్టణ మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ నాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా మహిళా నాయకురాలు సత్యమనోరమ, చెన్న సీతారాములు, రాంశెట్టి వీరేందర్, యుగంధర్, శంకర్, రాము, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హాస్టల్ భవనంపై నుంచి జారిపడిన విద్యార్థిని

● ఆస్పత్రికి తరలింపు

కేసముద్రం: హాస్టల్ మొదటి అంతస్తుపై నుంచి విద్యార్థిని ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిన సంఘటన ఇనుగుర్తిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో సోమవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా గోర్లపాడుకు చెందిన సౌమ్య ఇనుగుర్తి గురుకుల కళాశాలలో హెచ్ఈసీ సెకండియర్ చదువుతుంది. ఈ మేరకు మొదటి అంతస్తు నుంచి విద్యార్థినులతో కలిసి సౌమ్య కిందికి దిగుతుండగా, ప్రమాదవశాత్తు ఆమె కాలు స్లిప్‌కావడంతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న డయాస్‌పై పడింది. దీంతో ఆమె కుడి కాలుకు గాయం కాగా హుటాహుటిన మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని అధ్యాపకులు తెలిపారు. సౌమ్య కావాలనే మొదటి అంతస్తు నుండి దూకినట్లు అక్కడున్న తోటి విద్యార్థినులు చెబుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. జరిగిన ఘటనపై అధికారులు విచారణ జరుపనున్నట్లు తెలిసింది.

అధికారులపై తేనెటీగల దాడి

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని లక్ష్మీబ్యారేజీ వద్ద అధికారులపై సోమవారం తేనెటీగలు దాడి చేశాయి. జిల్లా సివిల్ జడ్జి జయరాం, ఎస్పీ సురేందర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పలిమెల మండలంలో న్యాయ సహాయ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వెళ్లి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో లక్ష్మీబ్యారేజీ వీక్షించడానికి వెళ్లగా అక్కడ తేనేటీగలు ప్రాజెక్టు గోడకు తెట్ట పెట్టి ఉంది. వరద తాకిడికి తేనెటీగలు ఒక్కసారిగా లేచి స్వైరవిహారం చేయడంతో ఎస్సై రాజ్‌కుమార్, కోర్టు పీపీ, ఇద్దరు సిబ్బంది, కానిస్టేబుల్‌పై దాడి చేశాయి. జడ్జి, ఎస్పీలకు తేనెటీగల దాడి జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గాయపడిన వారిని మహాదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి శ్రావణ మాసం షురూ!

● అధిక మాసంతో రెండు నెలలు శ్రావణమే
● 18 నుంచి ఆగస్టు 16 వరకు అధిక మాసం
● ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 14 వరకు నిజశ్రావణం
● రెండు నెలల పాటు లక్షపత్రి పూజలకు అవకాశం
● శివనామస్మరణతో మార్మోగనున్న కాళేశ్వరాలయం


కాళేశ్వరాలయం

కాళేశ్వరం : మహాశివునికి ప్రీతికరమైన మాసం శ్రావణమాసం. రెండు నెలల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో మంగళవారం ప్రారంభం కానుంది. ఈ ఏడాది అధికమాసం రావడంతో జూలై 18 నుంచి ఆగస్టు 16 వరకు అధికమాస శ్రావణం, ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 14 వరకు నిజ శ్రావణ వచ్చినట్లు వేదపండితులు చెబుతున్నారు. ఈ రెండు నెలల పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో శివనామస్మరణతో మారుమోగనుంది.

అధిక మాసం అంటే :

శాస్త్రం ప్రకారం కాలగణన సూర్యుడు, చంద్రుల ఆధారంగా జరుగుతుంది. సూర్యుడి ఆధారంగా లెక్క కట్టే కాలమానాన్ని 'సౌరమానం'అని, చంద్రుడుని ఆధారంగా లెక్కకట్టే కాలమానాన్ని 'చంద్రమానం' అంటారు. చంద్రమానంలో నెలకు 29.53 రోజులు. దీని ప్రకారం చంద్రమానం ఏడాదికి 354 రోజులు. సౌరమానంలో ఏడాదికి 365 రోజులు. సౌరమానానికి, చంద్రమానానికి మధ్య ఏడాదిలో 11 రోజులు తేడా ఉంది. ఈ మధ్య తేడాను సరి చేయడానికి 32 నెలలకోసారి ఈ మాసాన్ని అధికంగా కలుపుతారు. దానినే 'అధిక మాసం' అంటారు. ఈ మాసంలో దేవతారాధనలు చేయడానికి విశిష్టత. కానీ శుభకార్యాలు చేయరాదు. దీనినే 'పురుషోత్తమ మాసం'అంటారు.

నిజ శ్రావణమాసం

శ్రావణమాసంలో తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి వారి గర్భగుడిలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మాసంలో ప్రతి రోజు సాయంత్రం వేళల్లో భక్తులు అధికంగా బిల్వ దళాలతో (లక్షపత్రి) పూజను మహా శివున్ని పూజిస్తారు. ఒక జంటకు (భార్యభర్తలకు) రూ. 6వేల టికెట్‌తో ఒక రోజు ఐదుగురికి మాత్రమే ఈ పూజను నిర్వహిస్తారు. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ జరుగుతుంది. రెండు నెలలు ఉండడంతో అధికంగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఆన్‌లైన్‌లో బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి వార్లకు భక్తులు అత్యధికంగా రూ.1000 టికెట్ చెల్లించి అభిషేక పూజలు నిర్వహిస్తారు. కాళేశ్వరం దేవస్థానం అనుబంధ దేవాలయాలైన శ్రీశుభానందదేవి(పార్వతీ), శ్రీసరస్వతీ అమ్మ వార్ల ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేస్తారు.

రెండు నెలలు దేవతారాధన చేయవచ్చు



ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండు నెలలు శ్రావణమాసం ఉంటుంది. ఈ రెండు నెలల్లో మొదటి అధిక శ్రావణమాసం, నిజ శ్రావణమాసాల్లో రెండు నెలలు దేవతామూర్తులకు పూజలు నిర్వహిస్తే చాలా మంచిది. కానీ అధిక మాసంలో శుభ కార్యాలు చేయద్దు. నిజశ్రావణమాసంలో శుభ కార్యాలకు అనుకూలం. ఈ రెండు మాసాల్లో ఆలయంలో లక్షపత్రి పూజలు నిర్వహిస్తే మహాశివుని కరుణ కటాక్షంతో ముక్తి లభిస్తుంది.

పనకంటి ఫణీంద్రశర్మ, ఆలయ ముఖ్యఅర్చకుడు

లక్షపత్రి పూజలకు సిద్ధం



ఈ ఏడాది అధిక, నిజ శ్రావణ మాసాలతో రెండు నెలలు లక్షపత్రి పూజలు చేసేందుకు అంతా సిద్ధం చేశాం. ఇప్పటికే బిల్వదళాలు తెచ్చేందుకు గిరిజనులను ఏర్పాటు చేశాం. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా లక్షపత్రి పూజలకు అడ్వాన్స్‌గా టికెట్ల కౌంటర్ ఏర్పాటు చేశాం. రద్దీ ఎక్కువగా ఉంటే అదనంగా అర్చకులను ఏర్పాటు చేస్తాం. రద్దీతో ప్రసాదాల తయారీ చేస్తాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్నీ ఏర్పాటు చేస్తున్నాం.

ఎస్.మహేష్, ఈఓ, కాళేశ్వరం దేవస్థానం

రేవంత్, కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలి


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ టి.రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజు

● మూడు గంటల కరెంట్ ఎలా సరిపోతది..
● క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం
● మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షిప్రతినిధి, వరంగల్ : రైతులను కించపరిచే విధంగా వ్యాఖ్యానించిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దలు బేషరతుగా క్షమాపణలు చెప్పే వరకు తెలంగాణ వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. పైరవీలు, బ్రోకర్‌గా పనిచేసే రేవంత్‌రెడ్డి.. రైతులు, వారి సమస్యలపై అవగాహన లేక ఉచిత కరెంట్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ, నేతల తీరుపై ఇంకా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సోమవారం హనుమకొండలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. ఒకప్పుడు కరెంటు కష్టాలకు కారణమే కాంగ్రెస్సే అని టీడీపీలో ఉన్నప్పుడు తనతో కలిసి అసెంబ్లీ లోపల, ఎదుట ధర్నాలు చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ తరపున వకాల్తా పుచ్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కరెంట్ లేక ఎండిపోయిన పొలాలు చూసి భూమి ఉందంటే పిల్లను ఇవ్వలేదని, ఇప్పుడు భూమి ఉందంటేనే పిల్లనిచ్చే పరిస్థితి కేసీఆర్, బీఆర్ఎస్ పాలనలో వచ్చిందన్నారు. 'వ్యవసాయానికి కేవలం 3 గంటల కరెంటు చాలట. ఒక గంట కరెంటుతో ఒక ఎకరం పారించవచ్చట. వ్యవసాయం గురించి తెలిసినోడు మాట్లాడే మాటలేనా?.. రేవంత్‌రెడ్డికి అసలు సిగ్గుందా'అని మంత్రి దయాకర్‌రావు ప్రశ్నించారు. బేషరతుగా క్షమాపణలు చెప్పేదాకా విడిచిపెట్టబోమన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కడతారని, ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు తమ దరిదాపుల్లోనే లేవని.. రెండో స్థానం కోసం ఆ రెండు పార్టీలు పోటీపడుతున్నాయన్నారు. కాళేశ్వరం మహత్తర ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రతిపక్షపార్టీల నాయకులు రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. 'ఎక్కడ చూసినా ప్రాజెక్టుల్లో నీరు పారుతోంది.. చెరువులు, కుంటల్లో నీరు చేరి భూగర్భజలాలు పెరిగాయి.. భూముల ధరలు విపరీతంగా పెరిగింది. నేను కూడా రూ.2 లక్షల ఎకరం చొప్పున కొనుగోలు చేసిన భూమిని గత ఎన్నికల సమయంలో రూ.40 లక్షలకు ఎకరం చొప్పున అమ్మినా... ఇప్పుడా భూమి ధర ఎకరం రూ.కోటికి చేరింది. స్వరాష్ట్రంలో ఎనిమిదేళ్లలో జరిగిన అభివృద్ధి, మార్పులకు ఇవే నిదర్శనం'అని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు అరూరి రమేష్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, డా.టి.రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజు పాల్గొన్నారు.

నాగులమ్మ గుడిలో సూర్యుడి విగ్రహం

● గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి


రాతి విగ్రహాలను పరిశీలిస్తున్న రత్నాకర్‌రెడ్డి

కొడకండ్ల: జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని నాగులమ్మ గుడి ప్రాంగణంలో సూర్యుడి విగ్రహం గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ధర్మకర్తలు సింగరం చంద్రయ్య, గోధుమల సోమయ్య, వెంకటయ్య ఆహ్వానం మేరకు నెలపోగుల సందీప్‌తో కలిసి రత్నాకర్‌రెడ్డి నాగులమ్మ కుంట, బయ్యన్నవాగు రిజర్వాయర్‌లో కలిసిన కునారెడ్డి కుంట పరిసరాలు, పాటిగడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం నాగులమ్మ గుడిలో సూర్యుడి విగ్రహం ఉన్నట్లు గతంలో గుర్తించామని, ఈ ఆలయానికి పైనుంచి వెలుతురు పడేలా రంధ్రం ఉందని చెప్పారు. ప్రస్తుతం నాగులమ్మ కుంటకట్ట మీద పూర్వపు నాగులమ్మ గుడికి అర ఫీటు మందం, మూడు మీటర్ల పొడవుతో ఉన్న రాళ్లను ఉపయోగించారని, కట్ట కింద ఉన్న గుడి కూడా ఇదే విధంగా నిర్మించారని చెప్పారు. ఆలయ శిథిలాల్లో నలుమూలలు ఉన్న రాయికి దీర్ఘ చతురస్రాకారంలో తొల్చిన రంధ్రం ఉన్నట్లు గుర్తించామని, ఇది సగభాగం మాత్రమే ప్రస్తుతం ఉందని వివరించారు. దీన్నిబట్టి ఆలయ శిథిలాలు సూర్య దేవాలయానికి చెందినవై ఉండొచ్చని అభిప్రాయ పడ్డారు. గతంలో బయ్యన్న ఆలయంలో ఎంతో అరుదైన బృహత్ శిలా యుగం నాటి మానవాకృత శిల్పం గుర్తించినట్లు పేర్కొన్నారు.

కాజీపేటలో 62 కిలోల గంజాయి పట్టివేత


పట్టుకున్న గంజాయి ప్యాకెట్లను చూపిస్తున్న జీఆర్పీ సీఐ రాంమూర్తి, ఆర్పీఎఫ్ సీఐ

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో రైల్వే పోలీసులు సోమవారం 62 కిలోల గంజాయిని పట్టుకున్నారు. జీఆర్పీ సీఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్ర కారం.. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 3లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీ సులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా రైళ్లో గంజాయిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఒడిశాకు చెందిన సత్రజీత్ ప్రధాన్, అజాది తంతిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డారు. వీరి నుంచి సుమారు రూ.12,40,000 విలువ చేసే 31 ప్యాకెట్లలో సుమారు 62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరపర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, జీఆర్పీ ఎస్సై పరుశరాములు, పోలీసులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య


కళమ్మ (ఫైల్)

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని చక్రంతండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కమ్మపల్లి గ్రామశివారు చక్రంతండాకు చెందిన అజ్మీరా కిషన్- కళమ్మ(45) దంపతులకు ఒక ఎకరం వ్యవసాయం భూమి ఉంది. వ్యవసాయంతో పాటు వ్యవసాయ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తునాడు. వీరి ఒక కుమారుడు రాజేందర్ దివ్యాంగుడు. కుమార్తె హారికకు వివాహమైంది. కిషన్-కళమ్మలకు ఆర్థిక విషయాల్లో తరుచూ గొడవ జరుగుతూ ఉండేది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో క్షణికావేశానికి గురైన కళమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించింది. కుటుంబ సభ్యులు చూసి వెంటనే నర్సంపేట ఆస్పత్రికి తరలించే లోపు మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి సోమవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

తడబడిన బుడిబుడి అడుగులు..

● తలకిందులుగా బకెట్‌లో పడి 11 నెలలు బాలుడి మృతి


హేమంత్ (ఫైల్)

రఘునాథపల్లి: బుడి బుడి అడుగులు తడబడ్డాయి. ప్రమాదవశాత్తు తలకిందులుగా బకెట్‌లో పడి 11 నెలల బాలుడు మృతిచెందాడు. ఈ విషాద ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎక్కలదేవి లక్ష్మణ్- గీత దంపతులకు ఇద్దరు కుమారులు గోవర్ధన్, హేమంత్ (11నెలలు) ఉన్నారు. సోమవారం సాయంత్రం తల్లిదండ్రులు టైలరింగ్ పనుల్లో నిమగ్నం కాగా చిన్న కుమారుడు హేమంత్ బుడి బుడి అడుగులతో ఇంటి వెనకాల నీళ్లతో ఉన్న బకెట్ వద్దకు వెళ్లి ఆడుతుండగా ప్రమాదవశాత్తు తలకిందులుగా బకెట్లో పడ్డాడు. బాలుడు కనిపించకపోయేసరికి ఇంటి వెనకాల వెతికిచూడగా బకెట్లో తలకిందులుగా పడి మృతిచెంది ఉన్నాడు. తల్లిదండ్రులు రోదిస్తూ వెంటనే బాలుడిని స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు చెప్పాడు. కళ్లముందే కుమారుడు ఆటాడుకుంటూ బకెట్‌లో పడి విగత జీవిగా మారడంతో తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ విలపిస్తున్న తీరు అందరి హృదయాలను కలిచివేసింది. ఎస్సై రఘుపతి ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ..


రాజు (ఫైల్)

కాశిబుగ్గ : ఆర్థిక సమస్యలతో ఓ కూలీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటలోని వడ్డెరకాలనీకి చెందిన శివరాత్రి రాజు(35) భార్య వనితతో కలిసి మట్టి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక సమస్యలు, వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజు మధ్యాహ్నం నర్సంపేట నుంచి వరంగల్‌కు వచ్చి తన బాబాయ్‌కు తాను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నాని తెలిపారన్నారు. అప్పటికే చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య వరంగల్ రైల్వేస్టేషన్ వెంబడి శివనగర్ వైపు ఉన్న వినాయక గుడి సమీపంలో అప్‌లైన్‌లో వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతునికి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

స్నానానికి వెళ్లి కార్మికుడు గల్లంతు


రామ్‌సోరణ్ (ఫైల్)

నెక్కొండ: పొట్ట చేతపట్టుకొని ఉపాధి కోసం వచ్చిన ఓ హమాలీ కార్మికుడు స్నానానికి అని వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి గల్లంతైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం జరిగింది. ఎస్సై జానీపాష తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన హమాలీ కార్మికులు అన్నదమ్ములు పప్పు సురేణ్, రామ్‌సోరణ్ (22) నెక్కొండలోని చల్లా గోదాముల్లో పనులు చేసేందుకు రెండు నెలల క్రితం వచ్చారు. రోజు మాదిరిగానే రామ్‌సోరణ్ సమీపంలోని కుంటలో స్నానానికి ఒంటరిగా వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి కొట్టుకుపోతుండడంతో తోటి కార్మికులు దూరం నుంచి గమనించారు. వారు వెంటనే రక్షించే ప్రయత్నం చేసినప్పటికి కార్మికుడు నీట మునిగి గల్లంతయ్యాడని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి అన్న సురేణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై చెప్పారు. పోలీసులు జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టినా అతడి ఆచూకీ లభ్యం కాలేదన్నారు. తోటి కార్మికుడు నీట మునిగి గల్లంతు కావడంతో గోదాములో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌పరిధిలోని కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన అంబాల రవీందర్ కుమార్తె చందన కుట్టి (25) ఈనెల 3న రాత్రి తెల్లవారు జామున అందరు గాఢనిద్రలో ఉండగా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికారన్నారు. ఎక్కడా కూడా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ షెడ్డులో చోరీ

● రూ.80 వేల విలువ చేసే 19 ఎల్‌వీ కాయిల్స్ మాయం

పరకాల : పరకాల సబ్‌స్టేషన్ ఆవరణలోని ట్రాన్స్‌ఫార్మర్ షెడ్డులో ఆదివారం రాత్రి దొంగలుపడ్డారు. విధులు ముగించుకొని వెళ్లిన సిబ్బంది సోమవారం ఉదయం 8 గంటలకు ట్రాన్స్‌ఫార్మర్ షెడ్డు తెరువగా రూ. 82 విలువ చేసే 19ఎల్‌వీ కాయిల్స్ దొంగతనం జరిగినట్లు గుర్తించి షెడ్డు సబ్‌కాంట్రాక్టర్ భూరెడ్డి మధుసూదన్‌రెడ్డికి సమాచారం అందజేశారు. గుర్తుతెలియని వ్యక్తులు కిటికి నుంచి షెడ్డులోకి ప్రవేశించి చోరీకి పాల్పడగా మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం వ్యాన్


వ్యాన్‌లో ఇరుక్కుపోయిన రాజేష్ మృతదేహం


క్యాబిన్‌లో ఆర్తనాదాలు చేస్తున్న మహిళలు

● క్యాబిన్‌లో ఇరుక్కుని వ్యాన్‌డ్రైవర్ మృతి
● నలుగురు మహిళలకు తీవ్రగాయాలు


రాజేష్(ఫైల్)

వర్ధన్నపేట: ఆర్టీసీ బస్సు నెమ్మదిగా వెళ్తున్న క్రమంలో అతివేగంగా వెనుకనుంచి డీసీఎం వ్యాన్ వచ్చి బస్సును బలంగా ఢీకొట్టడంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా అందులో ఉన్న నలుగురి మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మంగ కథనం ప్రకారం.. తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్‌కు వెళ్లి తిరిగి వర్ధన్నపేట బస్టాండ్‌లోకి వెళ్లి తొర్రూరుకు వెళ్తున్న క్రమంలో వరంగల్ నుంచి పత్తి బేళ్లతో సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఆర్టీసీ బస్సు వెనుక భాగంలో అతివేగంగా వస్తూ అదుపు తప్పి ఢీకొట్టింది. వ్యాన్ డ్రైవర్ తోట రాజేష్(40) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందగా క్యాబిన్‌లో ఉన్న పత్తి బేళ్లను దిగుమతి చేయడానికి వెళుతూ నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ములుగుకు చెందిన సింగం భారతి, వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన పోవుర్సు రజిత, ఆనుక మంజు, వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ఎస్‌కె నసీం అలియాస్ ముంతాజ్ ఉన్నారు. వీరు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి సుమారు అర్ధగంటకు పైగా వీరు చేసిన ఆర్తనాదాలు పలువురిని కంటతడి పెట్టించాయి. క్యాబిన్ ముందు భాగంలో తాడు కట్టి క్యాబిన్‌ను ముందుకు లాగి వారిని అతి కష్టంగా బయటకు తీశారు. 108 అంబులెన్స్‌లో ఇద్దరిని తరలించగా మరో అంబులెన్సు రాకపోవడంతో ఎదురు చూసి వారిని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడుది గీసుకొండ మండలం కీర్తినగర్. రాజేష్‌కు భార్య తిరుపతమ్మ ఉంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అనుమాండ్ల సుధాకర్‌రెడ్డి వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సులో ప్రయాణికులు క్షేమం

ఆర్టీసీ బస్సులో కేవలం 15 మంది ప్రయాణికులు ఉండడం, వారు ముందు సీట్లలో కూర్చోవడంతో ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. ఒక వేళ వెనుక సీట్లలో ప్రయాణికులు ఉంటే అతిపెద్ద ప్రమాదం చోటుచేసుకునేదని పలువురు చర్చించుకున్నారు.

ఆదర్శంగా మారాలంటే..

దేశంలో ఆదర్శ గ్రామాల అంటువ్యాధి రావాలి

● విమానంలో వెళ్లేవారు పైనుంచి గంగదేవిపల్లిని చూడాలి
● ఆదర్శగ్రామాలుగా రూపుదిద్దే సూచీని రూపొందిస్తున్నాం
● సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ


గంగదేవిపల్లిలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గీసుకొండ: 'దేశంలోని గ్రామాలన్నీ గంగదేవిపల్లి, మరియపురంలా ఆదర్శంగా మారాలంటే..ఆదర్శ గ్రామాల అంటువ్యాధి రావాలి...అలాంటిది వస్తే అన్ని గ్రామాలు బాగుపడతాయి. దీని కోసం ఓ సూచీని తయారు చేసే ప్రయత్నంలో ఉన్నాం' అని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం 'ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేది ఎలా' అనే అంశంపై తన పీహెచ్‌డీ థీసిస్ కోసం మండలంలోని గంగదేవిపల్లి , మరియపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. రెండు గ్రామాల్లో ప్రజలతో సమావేశమై వారి అనుభవాలను, అభిప్రాయాలను ప్రశ్నావళి రూపంలో సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక గ్రామం ఆదర్శంగా నిలవడానికి గల కారణాలు, మిగతా గ్రామాలు ఆదర్శంగా ఎందుకు మారడం లేదో అనే విషయాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. జర్మనీలోని ఓ ఆదర్శ గ్రామం మీదుగా సమయంలో విమానాన్ని పైలెట్ తక్కువ ఎత్తులో తీసుకుని వెళ్తా ఆ గ్రామం గురించి ప్రయాణికులకు చెబుతూ చూపిస్తారని, అలాగే గంగదేవిపల్లిని విమానాల్లో వెళ్లే వారు చూసే రోజులు వస్తాయన్నారు. ఉత్తమ గ్రామ పంచాయతీల విషయంలో దేశంలో తెలంగాణ ముందుందని, ఇటీవల ప్రకటించిన 19 కేంద్ర అవార్డుల్లో 12 అవార్డులు తెలంగాణ పల్లెలకు రావడం విశేషం అన్నారు. మహారాష్ట్రలో రాలేగావ్ సిద్ధి గ్రామాన్ని అన్నా హజారే, హివ్రేబజార్‌ను కోకట్‌రావ్‌పవార్ ఆదర్శంగా తీర్చిదిద్దారని, అలాంటి కొందరి కృషితో పలుగ్రామాలు ఆదర్శంగా మారుతున్నాయని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, రాయపర్తి ఎంపీపీ అనిమిరెడ్డి, సర్పంచ్‌లు గోనె మల్లారెడ్డి, అల్లం బాలిరెడ్డి, బోడకుంట్ల ప్రకాశ్, అంకతి నాగేశ్వర్‌రావు, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, గోనె కుమారస్వామి, జాయిన్ ఫర్ డిపార్ట్‌మెంట్ సంస్థ జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, కవిత, పంచాయతీ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

మరియపురం సర్పంచ్‌కు ప్రశంసలు

మరియపురంను జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా కేవలం నాలుగేళ్లలోనే తీర్చిదిద్దిన సర్పంచ్ అల్లం బాలిరెడ్డి సేవలను, కృషిని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అభినందించారు. సర్పంచ్‌తో పాటు గ్రామ మహిళల అభిప్రాయాలను ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళిలో ఆయన సేకరించారు.